## మద్యం అధిక రేట్లకు విక్రయిస్తున్నారని..

- సుల్తానాబాద్‌లో ఓ బెల్ట్‌షాప్ నిర్వాహకుడి హంగామా
- ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సెల్ఫీ వీడియో

సుల్తానాబాద్ రూరల్, జూలై 22: తనకు మద్యం ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ, మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని ఓ బెల్ట్ షాప్ నిర్వాహకుడు సామాజిక మాధ్యమాల్లో పెట్టిన సెల్ఫీ వీడియో పెద్దపల్లి జిల్లాలో కలకలం రేపుతున్నది. సదరు వీడియో సుల్తానాబాద్ వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నది. వివరాల్లోకి వెళితే.. సుల్తానాబాద్ మండలం మియ్యాపూర్‌కు చెందిన ఓ బెల్టు షాపు నిర్వాహకుడు సుల్తానాబాద్ వైన్స్ షాపుల్లో మద్యం కొనుగోలు చేసి గ్రామంలో విక్రయిస్తుంటాడు. అయితే 'కొద్దిరోజులుగా వైన్స్ షాప్ నిర్వాహకులు అందరూ సిండికేట్ అయి బెల్టు షాపులకు అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నరు. నేను తీవ్రంగా నష్టపోతున్న. బాధ భరించలేక కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకుంటున్న' అని చెప్పిన సెల్ఫీ వీడియోలో సోమవారం వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బహిర్భూమి కోసం వెళ్లి..

### చెరువులో పడి బాలుడి మృత్యువాత



సాయికృష్ణ (ఫైల్)

తిమ్మాపూర్, జూలై 22 : బహిర్భూమి కోసం బయటకు వెళ్లిన ఓ విద్యార్థి చెరువులో పడి మృత్యువాత పడ్డాడు. పోలీసుల వివరాలిల ప్రకారం తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన మురళీకి జవ్వాజి సాయికృష్ణ(12) ఒక్కగానొక్క కొడుకు. గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత మరో ఇద్దరు తోటి విద్యార్థులతో కలిసి పాఠశాల నుంచి ఇంటికి వెళ్లాడు. అనంతరం పెన్సిల్ కొనుక్కుని వెళ్తానని తండ్రికి చెప్పి పాఠశాలకు వెళ్లకుండా నేరుగా బహిర్భూమి కోసం పాఠశాల సమీపంలోనే ఉన్న ఊరచెరువుకు వెళ్లాడు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులోకి నీళ్లు రావడంతోపాటు గట్టు ఒదులుగా ఉండడంతో ప్రమాదవశాత్తు జారి నీళ్లలో పడ్డాడు. దీంతో భయాందోళనకు గురైన మరో విద్యార్థులు సమీపంలో పొలం దున్నుతున్న ఓ ట్రాక్టర్ డ్రైవర్ వద్దకు వెళ్లి చెప్పారు. అతను వచ్చి వెతకగా బాలుడి జాడ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వారు వచ్చి వెతకగా సాయికృష్ణ మృతదేహం లభ్యమైంది. కాగా, విద్యార్థులు ఇష్టానుసారం ఇంటికి వెళ్లడం, అటు నుంచి అటే చెరువుకు వెళ్లి మృత్యువాత పడడంతో ఉపాధ్యాయుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలలోని బాత్‌రూంలను విద్యార్థులను వాడనివ్వరనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. సాయికృష్ణ తల్లి చిన్నతనంలోనే తండ్రి మురళీ నుంచి విడిపోగా.. మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. కంటికి రెప్పలా కాపాడుకున్న కొడుకు మృతి చెందడంతో తండ్రి రోదనలు మిన్నంటాయి.

## 'వైద్య విధాన పరిషత్'లో వైద్యులు, సిబ్బంది బదిలీ

కరీంనగర్ విద్యానగర్, జూలై 22 : తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో సాధారణ బదిలీల్లో భాగంగా డీసీహెచ్‌కు అనుబంధంగా ఉన్న వైద్యులు, సిబ్బందికి బదిలీ జరిగింది. అందులో భాగంగా సివిల్ సర్జన్లుగా పనిచేస్తున్న పీడియాట్రిషన్ అజయ్‌కుమార్ సిరిసిల్లకు, రేడియాలజిస్ట్ రవీందర్ సిరిసిల్లకు, ఆర్థోపెడిక్ కుమార్ పెద్దపల్లికి, డెర్మటాలజిస్ట్ లావణ్య గోదావరిఖనికి, పీడియాట్రిషన్ తిరుపతి హైదరాబాద్‌లోని వనస్థలీపురానికి, పీడియాట్రిషన్ సతీష్ ధర్మపురికి, పీడియాట్రిషన్ రవికాంత్ కోరుట్లకి, ఆర్థోపెడిక్ ధనరాజ్ సిరిసిల్లకి, డెంటల్ సర్జన్ రాగి శ్రీనివాస్ సిరిసిల్లకి, ఆప్తల్మాలజిస్ట్ రత్నమాల హైదరాబాద్‌లోని నాంపల్లికి, ఫిజీషియన్ కనకం శ్రీనివాస్ సిరిసిల్లకు బదిలీ అయ్యారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్లుగా పనిచేస్తున్న చెస్ట్ ఫిజీషియన్ వసీంకు పెద్దపల్లి, పీడియాట్రిషన్ శుభాంగిని హుజరాబాద్‌కి, గైనకాలజిస్ట్ నిశ్చల హుజరాబాద్‌కి బదిలీ అయ్యారు. ఏడీ జయశ్రీని సిద్దిపేటకు, ఏవో నజముల్లఖాన్ హుజురాబాద్‌కు బదిలీ చేశారు. నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 (డిప్యూటీ నర్సింగ్ ఆఫీసర్స్)గా పనిచేస్తున్న అంజమ్మ వేములవాడకి, సులోచన పెద్దపల్లికి, విజయలక్ష్మి సిరిసిల్లకు, సరళ హుజూరాబాద్‌కు బదిలీ చేశారు. హెడ్ నర్సులు(సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్)గా పనిచేస్తున్న సుందరి, సుధా సంగీత, ప్రభావతి, పతిమ మనీ, గంగాదేవి, బుజ్జమ్మను సిరిసిల్లకు, గ్లోరినా, ఉమా, జ్యోతి, సునితను హుజరాబాద్‌కు, పుష్పలత, తులసి లక్ష్మిని వేములవాడకు, ప్రేమల, రాణి, పద్మలతను కరీంనగర్‌కు బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నరేందర్, రాధాను సిరిసిల్లకు, సోనీని హుజురాబాద్‌కు బదిలీ చేశారు. జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అన్నపూర్ణ, స్వాతిని హుజూరాబాద్‌కు బదిలీ చేశారు. వీరితో పాటు పలువురు బదిలీ అయ్యారు.

## కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 22 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. తమ సమస్యలు ఉన్నతాధికారులకు చెప్పుకొనేందుకు వీలుగా 0878-2997247 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో ఇరవై నాలుగు గంటల పాటు అందుబాటులో ఉంటుందని, జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

# సింగరేణిని నిర్వీర్యం చేసేలా సర్కారు చర్యలు

- ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఏకం కావాలి
- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి



గోదావరిఖని మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, నాయకులు

గోదావరిఖని, జూలై 22 : సింగరేణిని ఆర్థికంగా నిర్వీర్యం చేసేలా రాష్ట్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ధ్వజమెత్తారు. అందుకు నిరసనగా కార్మికులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి అభివృద్ధికి ప్రాణాలను పణంగా పెట్టి భాగస్వాములవుతున్న వారి పిల్లల విద్యా అభ్యున్నతికి సింగరేణి సంస్థ ఎలాంటి తోడ్పాటు అందించడం లేదని, రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత పథకాలకు డబ్బులు కేటాయించడం దుర్మార్గపూరితమైన చర్య అని విమర్శించారు. సింగరేణి విద్యా సంస్థలను కాపాడే చర్యలకు సంస్థ చరమగీతం పాడిందని, విద్యా సంస్థలను మూసివేసి కార్మికుల అభ్యున్నతికి అడ్డుకట్ట వేసిందని మండిపడ్డారు. సివిల్స్‌కు సమాయత్తం అయ్యే విద్యార్థులకు దాదాపు 400 మందికి రూ.లక్ష చొప్పున సహాయం అందించే చర్యలను టీబీజీకేఎస్ వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. సామాజిక తోడ్పాటు పేరిట ఈ ప్రాంతంతో సంబంధం లేకుండా ఆర్థిక తోడ్పాటు అందిస్తే సంస్థకు ఆర్థిక నష్టం జరుగుతుందన్నారు. కార్మికులు తమ పిల్లలను ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివిస్తూ లక్షలాది రూపాయల ఖర్చు చేస్తున్నా, సింగరేణి తోడ్పాటు ఇవ్వకుండా గని కార్మికుల పిల్లలపై శీతకన్ను వేసిందని మండిపడ్డారు. ఒకే లక్ష్యం.. ఒకే కుటుంబం అని చెప్పే నైతిక అర్హత యాజమాన్యానికి లేదన్నారు. సమావేశంలో టీబీజీకేఎస్ సీనియర్ వైఎస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, పింగిలి సంపత్‌రెడ్డి, చల్లా రవీందర్‌రెడ్డి, దూట శేషగిరి, చెలుకలపెల్లి శ్రీనివాస్, పల్లె సురేందర్, శ్రీకాంత్‌రావు, ఐలయ్య, రహమాన్ ఉన్నారు.

## ప్రాణం తీసిన గొడవలు



సునీల్(ఫైల్)

ఫర్టిలైజర్‌సిటీ, జూలై 22 : కుటుంబంలో నెలకొన్న గొడవలతో ఒకరి ప్రాణం పోయింది. పరిహారం విషయంలో తండ్రిపై కత్తితో దాడికి ప్రయత్నించగా, అడ్డుగా వెళ్లిన తమ్ముడిపైనా దాడి చేయడంతో దవాఖానలో చికిత్స పొందుతూ మృత్యువాతపడ్డాడు. సోమవారం గోదావరిఖని పట్టణం క్రిష్ణానగర్‌లో కలకలం రేపిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణానగర్‌కు చెందిన ఆత్మకూరి ఓదెలుకు ఇద్దరు కొడుకులు అనిల్, సునీల్(26). వీరు సింగరేణి ప్రభావిత ప్రాంతమైన పెద్దంపేటలో భూములు కోల్పోవడంతో ఇటీవల నష్టపరిహారం లభించింది. ఈ విషయమై అనిల్ నిత్యం మద్యం సేవించి తండ్రి ఓదెలుతో గొడవ పడుతుండేవాడు. సోమవారం రాత్రి అనిల్ మద్యం మత్తులో వచ్చి తండ్రి ఓదెలుపై కత్తితో దాడికి ప్రయత్నించడంతో అక్కడే ఉన్న తమ్ముడు సునిల్ అడ్డుకున్నాడు. దీంతో అనిల్ సునిల్ ఎడమ చెయ్యి కింది భాగంలో కత్తితో దాడి చేయగా, గాయపడ్డ సునిల్‌ను స్థానికులు గోదావరిఖని ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. అయితే, పరిస్థితి విషమించి సాయంత్రం మృతి చెందాడు. సునిల్ ఐదేండ్ల క్రితం శ్రీలీలను ప్రేమ వివాహం చేసుకోగా వీరికి నాలుగేళ్ల కొడుకు విద్యారామ్, రెండేళ్ల కూతురు విద్యశ్రీ ఉన్నారు. కాగా, ఘటనా స్థలాన్ని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి సందర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు.














